'పాంచజన్య'లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ హై స్కూల్‌లో ముందస్తు క్రిస్‌మస్ వేడుకలను ఆ పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, హెచ్‌ఎం గాయిత్రి, ఏవో భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

క్రిస్‌మస్ వేడుకల్లో పాల్గొన్న పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్

చంద్రాయనగుట్ట మీద నుంచి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ప్రాధాన్యత గల పర్యాటక విభాగాల అభివృద్ధికి పత్యేక ప్రణాళికలు అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి మండల పరిధిలోని సత్య సాయి ఏకో-పార్కు, అమగొండపాల్యం అభయారణ్యం, బుక్కపట్నం రేంజ్‌ను ఆయన సందర్శించారు. చంద్రాయన గుట్ట ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పర్యాటక స్థలాన్ని, హిల్‌యును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. జిల్లా ఫారెస్ట్ అధికారి చక్రపాణి ఇతర అధికారులతో కలిసి చంద్రయనకుంట పరిశీలించారు, అనంతరం జిల్లా కలెక్టర్ సుమారు 1/2 కిలోమీటర్ కొండను ఎక్కి హిల్‌యును పరిశీలించారు. కొండ శిఖరం నుంచి పుట్టపర్తి పర్యటక కేంద్రాన్ని, కియా పరిశ్రమను చూడవచ్చునని అధికారులు జిల్లా కలెక్టర్ వివరించారు. త్వరలో దీన్ని పర్యటకంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టడానికి అవసరమైన ప్రణాళికలు, నివేదికలు సిద్ధం చేయాలని ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలను సందర్శించేలా రూట్ మ్యాప్ ప్రణాళికలు అమలు చేయడం. బలమైన రవాణా , నెట్వర్క్ లను నిర్మించడం ద్వారా సందర్శకుల సంఖ్యను పెంచవచ్చన్నారు. 2047 నాటికి సమర్థవంతమైన సాంకేతికత ఇంటిగ్రేటెడ్ మల్టీ మోడల్ కనెక్టివిటీల ద్వారా అన్ని పర్యాటక ప్రాంతాలను కలపడం. ప్రాంతాలను ఎకో టూరిజం ద్వారా అభివద్ధి చేయడం ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈసందర్భంగా ఉద్యానవన మొక్కలను కలెక్టర్ పరిశీలించారు. అతిథి గృహ నిర్మాణపనులను పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులతో త్వరలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసిన పలు నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్ఒ యామిని సరస్వతి, బుక్కపట్నం అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రపంచమే గౌరవిస్తున్న భారత రాజ్యాంగాన్ని రూపుమాపే కుట్రతోనే కేంద్ర హోం మంత్రి అమీత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని పలువురు ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, మాల మహానాడు మూర్తి, ఎపి ఎంఎస్ఎఫ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. హోంశాఖమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల పార్లమెంట్ సభ్యులందరూ స్పందించాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఈసందర్భంగా చైతన్య గంగిరెడ్డి మాట్లాడుతు 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలు అంబేద్కర్‌ను అవమానించడమే కాదని దేశంలోని ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని, యావత్తు ప్రజలను అవమానించడమేనని చెప్పారు. అమిత్‌షా తక్షణమే దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పడంతో పాటు, పదవినుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. దేశానికి మతోన్మాద భావజాలం పెద్ద ప్రమాదకరమని, దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, వారిని కూడగట్టాలన్నారు. అంబేద్కర్ పై వ్యాఖ్యలతో తన మనువాద మతోన్మాధ ధోరణిని అమిత్‌షా బయట పెట్టుకున్నారని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా తక్షణమే తనపదవికి రాజీనామా చేయాలని, ప్రజలకు భేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాల మహా నాడు నాయకులు మూర్తి, ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతు అంబేద్కర్ వాదాన్ని రూపుమాపి మనువాద రాజ్యాంగ అమలుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం యత్నిస్తోందని, ఈ క్రమంలోనే కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. దశల వారీ ఉద్యమంలో భాగంగా అన్ని రాజకీయ, ప్రజా సంఘాలతో పాటు కుల సంఘాలను కలుపుకుని ర్యాలీలు, నిరసన కార్యక్రమాలతో పాటు వివిధ రూపాలుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టే విధంగా రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు వెంకట్, యంద్రమ్మ, గంగమ్మ, అనీత, కిష్టప్ప, చౌడప్ప, మధు తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత ప్రచారాలపై అప్రమత్తంగా ఉండండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వినియోగదారులు మోసపూరిత ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వ్యాపార ప్రకటనలను విశ్లేషించుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లో జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ అశ్వర్థ నాయక్, పౌర సరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, అడిషనల్ డిఎంహెచ్ఒ తిప్పయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి గణేష్ బాబు, తూనికల కొలతల శాఖ అధికారి శివ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వినియోగదారుల సంక్షేమం కోసం 1986 డిసెంబర్ 26న మొట్టమొదటిసారిగా వినియోగదారుల రక్షణ చట్టం కార్యరూపం దాల్చిందన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా డిజిటల్ లావాదేవీల సమయంలో ఆన్ లైన్ కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. గుర్తింపు పొందిన వెబ్ సైట్లు ద్వారానే కొనుగోలు చేసుకోవడం మంచిదన్నారు. ఉచిత బహుమతులు డిస్కౌంట్ సేల్స్ వలలో పడొద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, పాస్ వర్డ్, పిన్ నెంబర్ లాంటి వ్యక్తిగత సమాచారాన్ని అపరచితులకు ఇవ్వరాదన్నారు. వినియోగదారులు తాము పొందిన సేవల విషయంలో మోసపోయిన సందర్భాలలో జిల్లా వినియోగదారుల ఫోరం, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా వకృత్వ పోటీలలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం ఇనయతుల్లా, అడిషనల్ ఎఎస్ఒలు సింధు, రమేష్ వినియోగదారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

నగదుబదిలీ పేరుతో మోసం

కార్మికులను ముంచుతున్న ఆన్‌లైన్ సర్వీసు నిర్వాహకుడు

లబోదిబోమంటున్న బాధితులు

తూమకుంటలో ఉన్న ఆన్‌లైన్ సెంటర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడలోని వీర్‌గో పేపర్ అట్టల పరిశ్రమలో ఉత్తర్ ప్రదేశ్ కు చెందిన వలస కార్మికుడు రామ్ మహేష్ గత మూడు నెలల క్రితం తూమకుంట చెక్ పోస్టులో ఉన్నా ఆన్ లైన్ సర్వీసుకు వచ్చి తన కుటుంబ సభ్యుల ఖాతాకు రూ.10వేలు జమ చేయాలని నగదును కోరారు. దీంతో ఆన్‌లైన్ సర్వీసు నిర్వాహకుడు అఫ్జల్ షమీం రూ.10వేలు నగదును తీసుకోవడంతో పాటు కార్మికుని వద్ద డిజిటల్ థంబ్ వేయించుకుని, అతని ఖాతా నుంచి రూ.10వేలు నగదును సైతం డ్రా చేశాడు. రోజులు గడచిన తన కుటుంబ సభ్యుల ఖాతకు డబ్బులు జమ కాక పోవడంతో ఆన్ లైన్ నిర్వహకుడి వద్దకు వచ్చి ఆరా తీశాడు. సర్వర్ సమస్య ఉందని...జమ అవుతుందని నిర్వాహకులు చెప్పి పంపాడు. ఇలా మూడు నెలల పాటు ఆ కార్మికునికి నిర్వాహకుడు చుక్కలు చూపించాడు. చివరకు తన ఖాతాలో సైతం రూ.10వేలు డ్రా అయినట్లు తెలుసుకున్న బాధితుడు ఆన్‌లైన్ సర్వీసు నిర్వాహకుడిని నిలదీశాడు. తాను డ్రా చేయలేదని, బ్యాంక్ స్టేట్ మెంట్ చూసుకోవాలని ఆన్‌లైన్ సర్వీసు నిర్వాహకుడు వలస కార్మికుడిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. చివరకు కర్నాటక రాష్ట్రం చిక్‌బళాపురంలో ఉన్నా పంజాబ్ నేషనల్ బ్యాంకుకు వెళ్లి స్టేట్ మెంట్ చూస్తే నిర్వహకుడు రూ.10వేలు కాజేసినట్లు తేలింది. దీంతో వలస కార్మికుడు తనకు న్యాయం చేయాలని స్థానిక కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్‌ను ఆశ్రయించాడు. వెంటనే అతను ఆన్ లైన్ సర్వీసు నిర్వహకుడిని నిలదీయడంతో అసలు విషయాలు బయటకు వచ్చాయి.

ఇలా ఒక్క రామ్‌మహేష్ మాత్రమే కాదు హిందూపురం స్టీల్ పరిశ్రమలో పని చేస్తున్న ముగ్గురు వలస కార్మికులను ఇదే విధంగా ఆన్‌లైన్ నిర్వాహకుడు మోసం చేశాడు. వలస కార్మికులు వారి కుటుంబ సభ్యుల ఖాతాకు డబ్బులు జమ చేయమని ఇస్తే నగదు తీసుకోవడంతో పాటు వారి ఖాతా నుంచి ఆన్ లైన్ సర్వీసు నిర్వహకుడు అఫ్జల్ షమీం డబ్బులు కాజేసినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకుని అడిగిన కార్మికులకు వాయిదాలు వేస్తు ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు బాధితులు వాపోతున్నారు.

ఉన్న ఇంటిని, కన్న తల్లిదండ్రులను, తననే నమ్ముకున్న కుటుంబాన్ని వదలి వేల కిలో మీటర్ల దూరం వచ్చి ఊరు కాని ఊరులో కష్ట పడి పని చేసి, సంపాదించిన సొమ్మును తన కుటుంబ సభ్యుల అవసరాలకు పంపాలని ఆన్ సెంటర్‌కు వెళుతున్న చదుకు రాని వలస కార్మికులను ఆన్‌లైన్ సర్వీసు నిర్వాహుడు మోసం చేస్తున్నాడు. స్థానికంగా ఆన్‌లైన్ సర్వీసులు నిర్వహిస్తున్న వారి వద్దకు వెళితే భాష సమస్య వస్తుందని ఇతర రాష్ట్రానికి చెందిన అఫ్జల్ షమీం వద్దకు వెళితే అతను కార్మికులను నిలువునా మోసం చేస్తున్నాడు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక వలస కార్మికులు లబోదిబోమంటున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడల్లో వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న వలస కార్మికులు ఆన్ లైన్ నగదు బదిలీ విషయంలో మోస పోతున్నారు. ఎవరైన సమస్యను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందించి వారికి న్యాయం చేస్తున్నాం. ఇలా ఎంతో మంది నిర్వహకుడి చేతిలో మోస పోయినట్లు తమ విచారణ తేలింది. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, సమగ్ర విచారణ చేపట్టి మోస పోయిన కార్మికులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం హిందూపురంలో సంబంధిత నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలో కేవల్ రోడ్డు, పెనుకొండ రోడ్డు, బెంగళూరు రోడ్డులలో ఆటో కార్మికుల ద్వారా సంవత్సరానికి రూ.25 చొప్పున సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐటియు హిందూపురం పట్టణ నాయకులు విఆర్.రాము, ఆటో పట్టణ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఎంతో మంది డిగ్రీ, పీజీ చదువుకున్న వారు ఆటో నడుపుకొని జీవనం గడుపుతున్నారని, వారి చదువుకు తగ్గ ఉద్యోగం లేక ఆటో రంగాన్ని ఎంచుకున్నారని చెప్పారు.అయితే ఆటో కార్మికుల పరిస్థితి రోజురోజుకు దారుణంగా తయారవుతోందని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆటో కార్మికుల గురించి ఏ ప్రభుత్వం కూడా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా రంగంలో కోట్లాదిమంది కార్మికులు ఆధారపడి ఉన్నారని, అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల తరహాలోనే రవాణా రంగంలో ఉన్న కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆటో కార్మికులను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మోద సురేష్, మోహన్, నాగరాజు, అనిల్, శంకరప్ప, నరేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో 301 సెల్ ఫోన్లు రికవరీ : ఎస్పీ

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలో మూడు నెలల కాలంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 301 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులకు వారి సెల్‌ఫోన్లను అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మూడు నెలల వ్యవధిలో రూ. 40 లక్షలు విలువచేసే 301 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేశామన్నారు. ఎంతోమంది నిరుద్యోగులు, చిరు ఉద్యోగులు, వ్యాపారులు కార్మికులు, కూలి పనులు చేసుకునే వారు సెల్‌ఫోన్లు పోగొట్టుకుని ఇబ్బందులు ఎదుర్కొని ఉంటారని ఎస్పీ తెలిపారు. పోలీస్ సాంకేతిక పరిజ్ఞానం వలన వారి వివరాలను రాబట్టి వాటిని వెతికి బాధితులకు అప్పగించామని ఈసందర్భంగా బాధితులు కళ్లలో ఆనందం చూస్తున్నామని తెలిపారు. ఎవరైనా ప్రజలు తమ మొబైల్‌ను పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 6305800426 లేదా సిఇఆర్ సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ల రికవరీలో ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేసిన టీం సభ్యులైన చంద్ర, కిరణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, రెహమాన్, శేఖర్, రవి, నారాయణస్వామి, విశ్వనాథ్, సుదర్శన్ రెడ్డి, గంగాధర్‌కు ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. గత సంవత్సరంలో 270 సెల్ ఫోన్ లను రికవరీ చేశామనివాటితో కలిపి 571 ఫోన్లను ఇప్పటిదాకా రికవరీ చేశామని ఎస్పీ తెలిపారు. ఎస్పీ,వి రత్న, అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు చేతుల మీదుగా బాధితులకు వారి సెల్‌ఫోన్లను అందజేశారు.

ఢిల్లీ రైతుల ఆమరణదీక్షకు ప్రజాసంఘాల సంఘీభావం

అంబేద్కర్ సర్కిల్‌లో క్యాండిల్ మార్చ్

ప్రజాశక్తి-హిందూపురం

రైతుల హక్కుల కోసం పోరాడుతున్న సర్దార్ జగ్జిత్ సింగ్ దలైవాల్ ఆమరణ నిరాహార దీక్షకు మంగళవారం హిందూపురం ప్రజాసంఘాల నాయకులు తమ సంఘీభావం ప్రకటించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ప్రజాసంఘాల నాయకులు క్యాండిల్ మార్చ్ చేపట్టారు. సర్దార్ జగ్జిత్ సింగ్ దలైవాలా ఆమరణ నిరాహార దీక్షకు ప్రజా సంఘాలు, అఖిల భారత టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు సోమశేఖర్ రెడ్డి, చైతన్య గంగిరెడ్డి సంయుక్త అధ్యక్షతన సంఘీభావ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రైతులపై నల్ల చట్టాలు ప్రయోగించి దాదాపు 700కుపైగా రైతుల ఉసురు తీసిందని అన్నారు. రైతుల డిమాండ్ల సాధన కోసం సర్దార్ జగ్జిత్ సింగ్ దలైవాలా కు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆమరణ నిరాహార దీక్ష లో సర్దార్ జగ్జిత్ సింగ్ దలైవాలా కు ఏమైనా జరిగితే కేంద్రం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ సీపీ నాయకులు శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు జమీల్, ఫయాజ్, వైసిపి నాయకులు అమానుల్లా, కదిరీష్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రవి కుమార్, వృక్ష రక్షకుడు భాస్కర్ రెడ్డి, సెల్ ఫోన్ అసోషియేషన్ ఇబ్రహీం, బీఎస్పీ హరి, సిక్కు రైతులు పల్వీందర్ సింగ్, భగవాన్ సింగ్, సత్పాల్ సింగ్ తదితరులు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొని సర్దార్ జగ్జిత్ సింగ్ దలైవాలా కు సంఘీభావం తెలిపారు.


క్యాండిల్‌మార్చ్‌లో పాల్గొన్న నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

వైసిపి ఇన్‌ఛార్జి దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో ఈ నెల 27న చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసిపి నిరసనకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతు ఽచంద్రబాబు అంటేనే బాదుడు గ్యారంటీ అని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు పేదల పాలిట శాపంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, వైసిపి కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ఎ. శివ, పట్టణ, మండల అధ్యక్షులు మన్సూర్, రాము, వైసిపి కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు.

గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

'ఎర్రకోట' గణతంత్ర వేడుకలకు ఎంజెపి విద్యార్థి

ప్రజాశక్తి-లేపాక్షి

జనవరి 26వ తేదీ ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు స్థానిక మహాత్మ జ్యోతి బాపూలే(ఎంజెపి) పాఠశాల విద్యార్థి మహేంద్ర ఎంపిక య్యాడని ప్రిన్సిపల్ సుందర్‌రాజ్ మంగళ వారం తెలిపారు. ఎంజెపి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మహేంద్ర రిపబ్లిక్ డే వేడుకల్లో ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా యోగా, నృత్య ప్రదర్శనకు ఎంపికయ్యాడు. విద్యార్థి ఎంపిక పట్ల ప్రిన్సిపల్ సుందర్‌రాజ్, జయసింహ నాయు డు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

మహేంద్ర

ప్రజాశక్తి
www.prajasakti.com

'బాదుడే బాదుడు పోస్టర్లు' విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

'బాదుడే బాదుడు' పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-మడకశిర రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా ఈ నెల 27వ తేదీ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'బాదుడే బాదుడు' కార్యక్రమం పోస్టర్లను మంగళవారం పట్టణంలోని వైఎస్ ఆర్ సర్కిల్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప, మాజీ మంత్రి హెచ్‌బి. నర్సేగౌడ్, వైసిపి రాష్ట్ర వక్కలిగ కమిటీ అధ్యక్షులు రంగేగౌడ్, జిల్లా నాయకులు ఆనంద్, రంగారెడ్డి, వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పశువుల్లో వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

పాడి రైతులకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి

పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి బాలానాయక్ సూచించారు. గొర్రెల్లో వచ్చే బొబ్బ, సరకా వ్యాధుల నివారణకు షీప్ ఫాక్స్, పిపిఆర్ వాక్సిన్లను తప్పనిసరిగా వేయించాలన్నారు. ఆవులు, గేదెల్లో వచ్చే ముద్ద చర్మవ్యాధులకు గోట్ ఫాక్స్ వాక్సిన్, కోళ్ల పెంపకంలో కొక్కెర వ్యాధి నివారణకు వాక్సిన్ వేయించాలన్నారు. పాడి రైతులు బహు వార్షిక పశుగ్రాస పెంపకం చేపట్టాలని, అందులో భాగంగా 50 సెంట్లలో సాగు చేసే గ్రాసానికి ప్రభుత్వం తరపున సబ్సిడీ అందిస్తామని తెలిపారు.

ఈ పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో లోకేశ్వర్‌రెడ్డి

రబీలో సాగు చేస్తున్న పంటలకు రైతులు జనవరి 10వ తేదీ లోపు ఈ పంట నమోదు ఖచ్చితంగా చేయించాలని ఏవో లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రైతు విత్తన సేకరణకు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌కు సంబంధించి వేరుశెనగకు నెలాఖరులోగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. అలాగే మూలికా వ్యవసాయ రంగంలో సాంకేతికత గురించి తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ధనలక్ష్మి, యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

కెజిబివిలో 'పది' మోడల్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మోడల్ పేపర్లు పంపిణీ చేసిన త్యాగరాజు దంపతులు

పట్టణంలోని కెజిబివిలో మంగళవారం త్యాగరాజు దంపతులు తమ కూతురు భారతి జ్ఞాపకార్థం 40 మంది బాలికలకు యుటిఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లతో పాటు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులను ఉచితంగా పంపిణీ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు యుటిఎఫ్ మోడల్ పేపర్స్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణానాయక్, ఎస్ఒ చంద్రకళ, యోగా గురువు నారాయణరెడ్డి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

ప్రజాశక్తి-తాడిమర్రి

తాడిమర్రి, ఎం.అగ్రహారం గ్రామాల్లో రైతులు సాగు చేసిన కంది, ఉలవ పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు పరిశీలించారు. పంటల దిగుబడి, ఖర్చు, తదితర వివరాలు తెలుసుకున్నారు. అధిక దిగుబడి కోసం ఎరువుల యాజమాన్యం, సమయానికి చీడపురుగుల నుంచి పంటల సంరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఎం.అగ్రహారం గ్రామ పరిధిలో ఆర్‌ఎడి పథకం కింద మంజూరు చేసిన యంత్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట ఎడిఎ కృష్ణయ్య, ఏవో రమాదేవి, రైతు సేవా కేంద్రం సిబ్బంది విజయ్, గౌతమి, నిజాముద్దీన్, రైతులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల వ్యాప్తంగా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సోమశేఖర్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి అనంతపురం రోడ్డులోని నేషనల్ హైవే-42 వై జంక్షన్ వద్ద కాపు కాచి ఇసుక టిప్పర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. రామాపురం నుంచి అనంతపురం నగరానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా ఇసుక టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముస్తాబైన చర్చిలు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

క్రిస్మస్ సందర్భంగా స్థానిక సి అండ్ ఐ జి మిషన్ చర్చితో పాటు పలు చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. క్రైస్తవులు ఇళ్లలో క్రిస్మస్ చెట్లు, స్టార్లు ఏర్పాటు చేశారు. రంగురంగుల కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు పాస్టర్ జయానందం, కార్యదర్శి దార్ల రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి కె.బాలరాజు, కమిటీ సభ్యులు ఎంయు.వినయ్‌కుమార్, ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారి పాల్ జోనాథన్ క్రిస్మస్ తాత వేషధారణలో ఆకట్టుకున్నాడు.

కాకతీయ విద్యానికేతన్‌లో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరెస్పాండెంట్ నిర్మల జయచంద్రారెడ్డి, వ్యవస్థాపకులు రామిరెడ్డి విద్యార్థులకు క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఆలపించిన పాటలు అలరించాయి. జీసస్ పుట్టుక, ఆ తర్వాత జరిగిన పరిణామాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శాంటా క్లాజ్ వేషధారణ, క్రిస్మస్ ట్రీ, తదితర విశేష అలంకరణలు చూపరులను ఆకర్షించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కళ్యాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక శ్రీజ్ఞానసాయి విద్యానికేతన్‌లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శాంటాక్లాజ్, ఏంజిల్ వేషధరణలో హాజరై ఆకట్టుకున్నారు. సాంస్కృతిక అలరించాయి. కార్యక్రమంలో కరెస్పాండంట్ కె.క్రిష్ణమోహన్‌రెడ్డి, ఉపాధ్యా యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక పివిఎస్ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ పివి.నాయుడు విద్యార్థులకు జీసస్ బోధనలు, త్యాగాలను వివరించారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం : కాకతీయ విద్యానికేతన్‌లో క్రిస్మస్ వేడుకలు

పిఎం సూర్యఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

'ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళ వారం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ఈ యోజన ద్వారా సౌరశక్తి వినియోగం పెరిగి, విద్యుత్ బిల్లు తగ్గించే అవకాశాలు ఉంటాయన్నారు. ఇంటి పై కప్పుపై కనీసం 10 చ.మీ స్థలంలో 1 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయడం ద్వారా తమ విద్యుత్ అవసరాలను తీర్చుకోవచ్చు అన్నారు. సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థ ద్వారా పర్యావరణ అనుకూలమైన శక్తిని ఉపయోగించి, విద్యుత్ వృథాను తగ్గించవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, నాయకులు జిఎం.శేఖర్, చిగిచెర్ల ఓబిరెడ్డి పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ప్రారంభం

పట్టణంలోని పోతుకుంట రోడ్డులోని మాతాశిశు సంక్షేమ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను మంత్రి సత్యకుమార్‌యాదవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సెంటర్‌లో గదులు, పరికరాలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులను ఆప్యాయత గా పలకరించి వైద్య సేవలు అందించాల న్నారు. ఎక్కడా ఫిర్యాదులు అందరాదన్నారు. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తల సేవలను అభినందించారు. అంతకుముందు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి, సుపరిపాలన దినోత్సవం పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు శేఖర్, టిడిపి నాయకులు కమతం కాట మయ్య, పరిసే సుధాకర్, డయాలసిస్ స్టేట్ మోడల్ ఆఫీసర్ నిర్మలగ్లోరీ, డిఎంహెచ్ఒ ఫైరోజ్‌బేగం, డిసిఐహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, అనంతపురం డిసిహెచ్ఎస్ పాల్ రవి కుమార్, ఆరోగ్య ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి, డాక్టర్ వివేక్, ఏవో ఉదయ్‌కుమార్, నాయకులు గేయానంద్, రాజారెడ్డి, జింకా చంద్రశేఖర్, ఓబులేష్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన న్యాయవాదులు

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను పట్టణ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాలతో సన్మానించారు. న్యాయవాదులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కంసల అశోక్‌కుమార్, కంసల కిషోర్ కుమార్, బిల్లే రవికృష్ణమోహన్, అతావుల్లా, న్యాయవాదులు పాల్గొన్నారు.

27న విద్యుత్ ఛార్జీల భారంపై వైసిపి నిరసన

మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

గోడపత్రికలు విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా ఈ నెల 27వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతామని మాజీ శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 6 నెలల్లోనే ప్రజలపై రూ. 15,500 కోట్ల విద్యుత్ భారాలు మోపు తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి నేడు ప్రజల నడ్డి విరిచేందుకు పూనుకున్నారన్నారు. తాను ఎప్పుడూ నిజమే చెపుతానని చెప్పే పవన్ కళ్యాణ్ పెంచిన విద్యుత్ ఛార్జీలపై ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. 'తల్లికి వందనం' పథకం ఏమైందని నిలదీశారు. ఎవరైనా ఏదైనా ప్రశ్నిస్తే అక్రమంగా పోలీస్ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. 3 లక్షల సామాజిక భద్రత పింఛన్లు తొలగించేందుకు సర్వం సిద్ధం చేశారని, రాబోయే రోజుల్లో మరిన్ని పింఛన్లు కోత పెట్టేందుకు కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఈ విషయాలన్నీ గమనిస్తున్నారని ఇకనైనా ఎన్నికల హామీలను నెరవేర్చారలని, లేనిచో ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ నెల 27వ తేదీ పుట్టపర్తి లోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాలో వైసిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమం లో వైసిపి రాష్ట్ర కార్యదర్శి డిఎస్.కేశవరెడ్డి, మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, ఎంపిపి ఎవి.రమణారెడ్డి, కౌన్సిలర్లు చెరువుభాస్కర్‌రెడ్డి, పవన్, నాయకులు ఆవుటాల రమణారెడ్డి, నారాయణరెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి సాయిలీలరెడ్డి, బిల్డర్ మల్లి, గోవర్ధన్‌రెడ్డి, గంగాద్రి, కేశప్ప, ఫొటో సాయి, ఎస్‌టిడి నరసింహులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-బుక్కపట్నం

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి అనంతపురం జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దిలీప్, జగదీష్, దేవా తెలిపారు. టోర్నీలో ఉమ్మడి అనంత పురం జిల్లా వ్యాప్తంగా 30 జట్టు పాల్గొన్నాయి. పోటీలను మంగళవారం డైట్ కళాశాల పిడి రామకృష్ణ, సర్పంచి నాగలక్ష్మి రాజు, టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచి సాకే యశోద, గంగాధర్ ప్రారంభించారు. తొలి రోజు జరిగిన పోటీల్లో పది జట్లు రెండో రౌండ్‌కు చేరుకున్నాయి. బుధవారం క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనల్స్ ఫైనల్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని అతిథులు సూచించారు. విజేత జట్టుకు రూ. 30 వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 20వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 10వేల నగదుతో పాటు ట్రోఫీలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

అంతర్జాతీయ మానవ హక్కుల జోనల్ అధ్యక్షురాలు గొర్తి భారతిదేవి

ప్రజాశక్తి-ధర్మవరంటౌన్

గొర్తి భారతిదేవి

అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి సౌత్ ఇండియా జోనల్ అధ్యక్షురాలిగా ధర్మవరం పట్టణానికి చెందిన గొర్తి భారతిదేవి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల సమితి ఫౌండర్, జాతీయ అధ్యక్షులు డాక్టర్ హెచ్‌ఎండి ముజాహిద్ నుంచి ఆదేశాలు అందాయి. గొర్తి భారతి దేవి కొన్నేళ్లుగా సామాజిక సేవలో ముందున్నారు. ధర్మవరంలో కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటూ సాయం కోరిన వారికి చేయూతనందిస్తున్నారు. భర్త గొర్తి సుధాకర్‌నాయుడు ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. గొర్తి భారతిదేవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు.

హంద్రీనీవా కాలువకు మరమ్మతులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

కాలువ మరమ్మతులను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు

స్థానిక నక్కలగుట్ట సమీపంలో మంగళవారం మంత్రి సవిత భర్త వెంకటేశ్వర రావు హంద్రీనీవా కాలువ మరమ్మతులను ప్రారంభించారు. వెంకటేశ్వరరావు హిటాచికి పూజ చేసి పనులను ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ రైతుల వినతి మేరకు ఎమ్మెల్యే బాలకృష్ణ, మంత్రి సవిత ఎమర్జెన్సీ నిధుల కింద రూ. 1.2 కోట్లు మంజూరు చేయించడంతో పనులు ప్రారంభించామన్నారు. తద్వారా కాలువలో నీళ్ల వృథా కాకుండా రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వడ్డే సూరి, పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, నాయకులు మద్దిలేటి, పెదకోడిపల్లి ప్రకాష్, గణేష్ పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వాల్మీకి సంఘం నాయకులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించడం, వారి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయమని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి వెల్లడించారు. పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎపిలో వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం కోసం గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ అంశాలపై చర్చించారు. వాల్మీకులు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బంగారు కృష్ణమూర్తి, రాష్ట్ర వాల్మీకి యువజన అధ్యక్షులు ఎం.శ్రావణమూర్తిలను రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. సమావేశంలో వాల్మీకి సేవా సంఘం నాయకులు బొట్టు చంద్ర, ఆనంద్, గంగరాజు, పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మడకశిర

జనవరి 5, 6, 7, 8 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించే యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, కార్యదర్శి నరసింహప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ పాఠశాల ఆవరణలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యం లో స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. భూతన్న, నరసింహప్ప మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిందన్నారు. నాటి నుంచి నేటి వరకూ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయ సంక్షేమం, సమాజాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నంజప్ప, దేవరాజు,. నరసింహమూర్తి, మహంతేష్, కదిరన్న, రామాంజనేయులు, సిద్ధార్థ్, నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలుదారులకు రశీదు ఇవ్వాలి : ఎడిఎ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎరువులు, మందులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ విధిగా రశీదు ఇవ్వాలని ఎడిఎ కృష్ణయ్య, ఏవో ముస్తఫా ఆదేశించారు. వారు మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అందులో భాగంగా సాయిరాం సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో విత్తనాల స్టాక్ వివరాలు, సోర్స్ సర్టిఫికెట్లను పరిశీలించారు. దుకాణంలో నిల్వ ఉంచిన వరి విత్తనాల నుంచి నమూనాలు సేకరించి పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపారు. విత్తన డీలర్లు తప్పనిసరిగా సర్టిఫికెట్ కలిగిన అధీకృత విత్తన సరఫరాదారుల నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యాపారిపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

రైతులు పండించిన పంట దిగుబడులను కొనుగోలు చేసే క్రమంలో తూకాల ద్వారా మోసాలకు పాల్పడుతున్న దళారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో టి.ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. హరి మాట్లాడుతూ పరిగికి చెందిన రైతు రాజేష్ పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని వ్యాపారి గోపాల్‌కు విక్రయిస్తుండగా అతడు తూకంలో మోసం చేశాడని మండి పడ్డారు. ఈ విషయంపై పరిగి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, వ్యాపారి గోపాల్ వల్ల తూకంలో నష్టపోయిన రైతులం దరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దీన్, సిఐటియు నాయకులు రమేష్, నాగరాజు, బాబావలి, మహబూబ్, ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.



రైతులను మోసం చేసిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆనంద్‌కుమార్‌కు వినతి ఇస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సు లక్ష్యం

ప్రజాశక్తి-గాండ్లపెంట

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహశీల్దార్ బి.బాబురావు తెలిపారు. మండలంలోని మడుగువారుగొంది గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 6 అర్జీలు అందాయి. వాటిని పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరి స్తామని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అసిస్టెంట్ జాఫర్, విఆర్ఒ ఎస్.అమానుల్లా, రైతులు పాల్గొన్నారు.

'నమో అదానీ-కరెంట్ కహానీ' పుస్తకం విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

'నమో అదానీ-కరెంట్ కహానీ' పుస్తకం విడుదల

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని సివిల్ సప్లై హమాలీ యూనియన్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో 'నమో అదానీ-కరెంట్ కహానీ' పుస్తకాన్ని సిపిఎం నాయకులు విడుదల చేశారు. సిపిఎం నాయకులు హరి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకి'తో సౌరవిద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవడానికి అదానీ కంపెనీలు రూ. 1,750 కోట్లు లంచం ఇచ్చాయన్న కుంభకోణం అమెరికాలో బయట పడిందన్నారు. ఇంత పెద్ద కుంభకోణం బయటపడినా మన నాయకులు మాత్రం మౌనం వహించారని, ఎటువంటి దర్యాప్తులు చేపట్టకపోగా, దాన్ని కప్పేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ వ్యవహారం కేవలం అవినీతికి సంబంధించినది మాత్రమే కాదని, దీని ఫలితంగా ప్రజలు అనేక భారాలు మోయాల్సి వస్తుందన్నారు. ఎపిలో ప్రజల మీద పడుతున్న విద్యుత్ బిల్లుల భారాలు అదానీ అవినీతి ప్రతి ఫలమే అన్నారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల కనీస బాధ్యతో ఆలోచించకుండా కార్పొరేట్ల సేవ కోసం తహతహలాడుతున్నాయన్నారు. ప్రజలకు తీవ్ర నష్టం కలుగ చేసే ఈ అవినీతి ఒప్పందం లోతు పాతులను ఈ చిన్న పుస్తకం వెలుగు లోకి తెచ్చిందని తెలిపారు. ఈ పరిణామాలన్నీ గమనించి, ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత, ప్రజాస్వామ్యవాదులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దీన్, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, సిపిఎం మండల నాయకులు మహబూబ్ బాషా, ఆరిఫ్, హనుమంతు, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నూతన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజ్‌బేగం మంగళవారం కలెక్టర్ టిఎస్.చేతన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అన్నమయ్య జిల్లాలోని వాయల్పాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న ఫిరోజ్‌బేగం ఉద్యోగోన్నతి బదిలీపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వచ్చారు. ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు డిఎంహెచ్ఒ కార్యాలయ సిబ్బంది, ఎస్ఒ కళాధర్, సూర్యనారాయణ, రేఖ పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటి పైకప్పుకూలి ఒకరు మృతి

ప్రజాశక్తి-కదిరి టౌన్

మృతిచెందిన గంగులప్ప

పొట్టకూటి కోసం కూలి పనులకు వెళ్లి ప్రమాదవశాత్తూ ఇంటి పైకప్పు కూలి మీద పడడంతో ఓ కూలీ మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణంలోని అమీన్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చలమకుంట్ల గ్రామానికి చెందిన తీగలకుంట గంగులప్పతో పాటు మరి కొందరు కూలీలు మంగళవారం పట్టణంలోని అమీన్‌నగర్‌లో ఉన్న బిసి హాస్టల్ సమీపం లో ఓ పాత మిద్దెను కూల్చడానికి కూలి పనులకు వెళ్లారు. పాత మిద్దెను కూలుస్తుండగా ఉన్నఫళంగా తలుపుపై ఉన్న సన్‌సైడ్ భాగం గంగులప్ప పైన పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించాడు. ఈ ప్రమాదంలో మరో కూలీ రమణకు స్వల్ప గాయాలయ్యాయి. గంగులప్ప భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

2, 3 తేదీల్లో కేంద్ర బృందాలు పర్యటన

ప్రజాశక్తి-ముదిగుబ్బ

కేంద్ర కరువు అధ్యయన బృందాలు జనవరి 2, 3 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నాయి. ఈ క్రమంలో ఆ బృందాలు కరువు వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు పొలాలను ఎంపిక చేయడానికి మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఎడిఎ ఎస్.సత్యనారాయణ మండలంలోని సంకేపల్లి, జొన్నలకొత్తపల్లి గ్రామాల్లో పర్యటించారు.

కునుతూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని కునుతూరు గ్రామంలో 11 కె.వి త్రీ ఫేస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తే కునుతూరుతో పాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడడంతో పాటు, ఈ ప్రాంతం అభివృద్ధికి కొత్త ఒరవడిని అందించే అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు బి.వేణుగోపాల్‌రెడ్డి, ధర్మవరం రూరల్ మండల కన్వీనర్ మహేష్‌చౌదరి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సాగుదారులకు అసైన్మెంట్ హక్కులు కల్పించండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

తహశీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

మండలంలోని తుంగోడు రెవెన్యూ పొలంలో ఉన్న సర్వే నెంబర్-28లో దళితులు, పేదలు ప్రభుత్వ భూమిని చదును చేసి సాగు చేసుకుంటు న్నారని, వారికి అసైన్మెంట్ హక్కులు కల్పించాలని కోరుతూ మంగళవారం తుంగోడులో జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సులో కెవిపిఎస్ ఆధ్వ ర్యంలో తహశీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 35 ఏళ్ల నుం చి ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ పంటలు పండిస్తున్నామని, సాగుదారులకు హద్దులు కనబ రిచి అసైన్మెంట్ హక్కులు కల్పించాలని పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. కార్యక్ర మంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, సాగుదారులు అంజనమ్మ, సరస్వతి, బాబు, అశ్వత్థరెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఓబుళమ్మ, గంగమ్మ, పాల్గొన్నారు.

ఐచర్ ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కల్లూరు గ్రామం వద్ద మంగళవారం కొడికొండ-శిర జాతీయ రహదారిపై ఐచర్ వాహనం ఢీ కొనడంతో నీరుగంటి అంజనప్ప(85) మృతి చెందాడు. వృద్ధుడు కుమారుడు నరసింహప్ప తెలిపిన వివరాలు.. హిందూపురం మండలంలోని మేలాపురం గ్రామానికి చెందిన నీరుగంటి అంజనప్ప పూలకుంట గ్రామంలోని కూతురు పద్మక్కను చూడటానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదానికి గురై మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఐచర్ వాహనాన్ని సీజ్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాత్రి వేళ ప్రహరీ గోడ దూకి ఇంటి ఆవరణలోకి చొరబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు.. పట్టణంలోని అడపాల వీధి లైట్ హౌస్ సమీపంలో నివాసం ఉంటున్న వడ్డారపు గంగాధర్ ఇంటి ఆవరణలోకి సోమవారం రాత్రి 11 గంటల సమయంలో కదిరి లోటస్ జిమ్ నిర్వాహకుడు రమేష్‌నాయక్ ప్రహరీ దూకి ఇంటి ఇంటి ఆవరణలోకి దూకాడు. ఇంట్లో ఉన్న గంగాధర్ గట్టిగా కేకలు వేస్తూ అతడిని పట్టుకునే లోపు పారిపోయాడు. వడ్డారపు గంగాధర్ ఫిర్యాదు మేరకు రమేష్ నాయక్ పై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.